
## మినీ కథలు:

# విలువ



'దర్గాకళామందిర్' ఆకాశంలో మెరిసే తారలనే ధిక్కరిస్తున్నట్లుగా ఠీవిగా వెలుగుతున్న రంగురంగుల బల్బుల తోరణాలతో పెళ్ళివారిని ఆహ్వానిస్తూంది. పెళ్ళికొడుకు రమేష్ డాక్టరు చదివాడు. పుష్పక విమానంలాంటి కారు ఒకటి రయ్యిని గేటు లోపలికి వచ్చి ఆగింది. లక్ష్మీపతి దంపతులు అందులోనుంచి ఠీవిగా దిగారు. రెండో అంతస్థులో స్నేహబృందంతో ఉన్న రమేష్ వారిని చూసి రెండేసి మెట్లు దాటుతూ ఎదురెళ్ళి చిరునవ్వుతో సగౌరవంగా వారిని ఆహ్వానించాడు. సరిగ్గా అదే సమయంలో వచ్చాడు చలపతి. అందరిచూపులూ వారిమీదే నిలిచాయి.

"వీరు మా మేనమామ. పేరు లక్ష్మీపతి. ఎక్జిక్యూటివ్ ఇంజనీరు. ఈమె మా అత్తయ్య. ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు." అంటూ తన స్నేహితులకు పరిచయం చేశాడు రమేష్. వారిని ఎరిగున్న బంధువులు కూడా దగ్గరికొచ్చి మాట కలిపారు. అలా అంచెలంచెలుగా పెళ్ళికి విచ్చేసిన అతిధులందరికీ ఈ విషయం తెలిసిపోయింది. పెళ్ళికొడుక్కి స్వయానా మేనమామట. అతడు ఇంజనీరు. ఆమె ప్రిన్సిపాలట. అలా వారి సంపాదనను. హోదాని గురించి చెప్పుకుంటున్నారు. అవన్నీ మరో వ్యక్తి కూడా వింటున్నాడు. చూస్తున్నాడు. అతను చలపతి. అలా చెప్పుకుంటున్నవారు ఠక్కున మాటలాపి మరీ చూస్తున్నారు. మరో క్రొత్త మనిషిని చూసి అనే కంటే అతని నీరుకావిరంగు బట్టలు చూసి అంటే బాగుంటుందేమో! ఆ బట్టలు అతని పేదరికాన్ని చాటి చెప్తున్నాయి. చుక్కల్లో చంద్రుడిలా అందరిలోనూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న లక్ష్మీపతి అందరి చూపులకూ ఉక్కిరి బిక్కిరి అవుతూనే మరింత ఠీవిని ప్రదర్శించాడు. దర్జాగా ఖరీదైన బట్టల్లో వున్న లక్ష్మీపతి ముందు తనో దిష్టిబొమ్మలాగ ఫీలవుతూ అందరి చూపులకు ఉక్కిరి బిక్కిరి అవుతూ సిగ్గుతో తల వంచాడు చలపతి.

ఈ సంఘంలో బాగా డబ్బున్న వాడయినా యిబ్బందే. లేనివాడయినా యిబ్బందే. జనం లక్ష్మీపతినీ. చలపతినీ ఇదర్నీ కూడా ఆశ్చర్యంగానే చూశారు. కానీ ఆ చూపుల్లో ఎంతో తేడా వుంది.

బిక్కు బిక్కుమంటూ పెళ్ళి కొడుకు దగ్గరకు వెళ్ళిన చలపతిని చూసి ముఖం చిట్లించారు పెళ్ళికొడుకూ. లక్ష్మీపతి.... అతని పేదరికం తమ కెక్కడ అంటుకుంటుందో నన్న భయంవల్లనేమో, అతన్ని ఎరిగున్న బంధుజనం కూడా చూసీ చూడనట్లు నటించారు.

పెళ్ళికొడుకు స్నేహితులు "ఆయన ఎవరని...." అతనిని ప్రశ్నించనూలేదు. "ఫలానా...." అని పెళ్ళికొడుకు అతనిని పరిచయం చేయనూలేదు. చదువు మనిషిలో సంస్కారాన్ని పెంచుతుందంటారు. కానీ, రమేష్‌లాంటి చదువుకున్న యువకులలో అది ఎంతవరకు నిజం? ఏది ఏమైనా నేటి సంఘంలో డబ్బుకీ. హోదాకీ ఉన్న విలువ మనిషికీ. మనసుకీ లేదు. అనుకొంటూ ఇంక అక్కడ నిలబడలేక సంఘంలో తనకున్న స్థానమేమిటో తెలిసీ తానక్కడికొచ్చినందుకు తనలోతానే తిట్టుకొంటూ బయటికొచ్చి. రోడ్డుమీద నిలబడి ఇంద్రభవనంలా వెలిగిపోతున్న ఆ భవనంవేపూ. అందులో తిరుగుతున్న ఖరీదైన మనుషులవైపూ చూశాడు. కళ్ళు జిగేలుమన్పించే ఆ లైట్ల తోరణాలు తననూ. తన పేదరికాన్ని చూసి ఫక్కున నవ్వుతున్నట్లు ఫీలవుతూ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు పెళ్ళికొడుక్కి స్వయాదా మరో మేనమామ అయిన చలపతి.

— అక్కినేని లక్ష్మి అన్నపూర్ణ

★

"అమ్మా! బిచ్చం తల్లీ!"

వీధి వరండాలో కూర్చుని ఎనిమిదేళ్ళ నానిగాడికి పాఠాలు చెబుతున్న విశ్వనాధం చిరాగ్గా చూశాడు.

"ఇప్పుడేం వీల్లేదు.. అలా వెళ్ళవోయ్" అన్నాడు.

"ధర్మ పెబువులు కనికరించాల."

"చెబుతుంటే నీక్కాదూ, వెళ్ళు.... వెళ్ళు.... ప్రతీరోజూ ఇదొక న్యూసెన్స్ అయిపోతోంది."

వాడు వెళ్ళిన ఐదు నిముషాలకు మరొకడొచ్చాడు.

"బాబూ! ధర్మం చేయించండి బాబూ"

మళ్ళీ చిరాగ్గా తలెత్తి చూసి "ఈ రోజుల్లో ప్రతీవాడికి ఇదొక అలవాటైపోయింది. ఒళ్ళొంచి పని చెయ్యలేక ముష్టికి బయలుదేరుతున్నారు. ఇదొక పెట్టుబడిలేని లాభసాటి వ్యాపారంలా తయారైంది. దుక్కలాగున్నావ్ ఎక్కడైనా పని చేసుకోరాదూ?"

"ఏదైనా పనిప్పించండి బాబయ్యా."

"పైగా ఇదొకటా? ముష్టికోసం రోజూ సవాలక్షమంది వస్తుంటారు. వచ్చిన ప్రతివాడికి పనిప్పిస్తూ కూర్చోడానికి ఇదేమైనా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ అనుకున్నావా?"

# బిచ్చం



"ముష్టెయ్యకపోయినా పెద్ద ఉపన్యాసం మాత్రం ఇచ్చి నాడు" గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు వాడు.

ఇలా వచ్చిన వాళ్ళందరినీ ఏదో సాధిస్తూ పంపెయ్యడం గమనించాడు నానిగాడు. వచ్చినవాళ్ళలో చేతులూ, కాళ్ళూ లేని వాళ్ళు, బక్కచిక్కినవాళ్ళూ వున్నారు. అయినా ఏవో సాకులు చెప్పి ముష్టెయ్యకుండా పంపేయడం వాడికెందుకో నచ్చలేదు. కొందర్ని చూడగానే వాడి హృదయం కరిగిపోయి తాను దాచుకున్న డబ్బుల్లోంచి ఐదు పైసలు వేస్తానన్నాడు

"తప్పమ్మా! అలావేస్తే బిచ్చగాళ్ళను ప్రోత్సహించినట్లవుతుంది. దీనివల్ల సోమరిపోతులు ఎక్కువైపోతారు" అంటూ మందలించాడు.

పాఠం ప్రారంభించి ఏడు నిమిషాలయిందో లేదో "డమక్ డమక్" మంటూ డప్పుల చప్పుళ్ళు వినిపించాయి.

"ఆదివారం శెలవుకాదుగాని, ఈ ముష్టివాళ్ళకు సమాధానం చెప్పలేక చస్తున్నాను...." అంటూ అసహనంగా తలెత్తాడు విశ్వనాధం.

"నూకాలమ్మ జోగండి...." దాదాపు ఆజ్ఞాపించినట్లు అడిగిందొక కంఠం.

కంగారుగా కుర్చీలోంచి లేచి లుంగీ సర్దుకుంటూ "ఒరే నానిగా ఇంట్లోకెళ్ళి పావుశేరు బియ్యం, అర్ధ రూపాయి తెచ్చి వెయ్యమ్మా" అంటూ భక్తిగా లెంపలేసుకొని, కుంకం బొట్టు పెట్టుకున్నాడు విశ్వనాధం.

అంతవరకూ బిచ్చం వెయడం అపరాధంగా చెప్పిన తండ్రిదుక్కలావున్న వీడెవడో బిచ్చం అడగ్గానే ఏమీ అనకుండా ఎందుకు వెయ్యమంటున్నాడో బోధపడక, అడిగితే వీపు చిట్లుతుందని తెలుసు కనుక జారిపోతున్న నిక్కరు మీదకు లాక్కుంటూ బిచ్చం....కాదు,కాదు.... జోగి తేడానికి గదిలోకెళ్ళాడు నానిగాడు

— సునర్ల సర్వేశ్వరశాస్త్రి

# కప్పల తక్కెడ



భోజరాజింకా నిద్ర లేవనేలేదు చంద్రప్ప పరుగున వచ్చాడు.

భోజరాజు భార్య కనకాలు ఆశ్చర్యపోయింది. ఎందుకంటే నిన్నటివరకూ చంద్రప్ప, భోజరాజూ బద్ధ విరోధులు. మరింత ప్రొద్దున చంద్రప్ప ఎందుకు వచ్చాడో అర్ధంకాక సతమతమవుతుంది కనకాలు. ఇంతలో చంద్రప్పే మాటలు ప్రారంభించాడు.

"ఇంకా బావ లేవలేదా?"

"లేవలేదండీ"

"సర్లే! హాల్లో కూర్చుంటాను. లేవగానే చెప్పు."

"అలాగే"

* * *

చంద్రప్ప, భోజరాజూ స్వయాన బావ మరుదులు. కాని గత ఎన్నికల్లో చంద్రప్ప, భోజరాజు, చంచల్రావుకి తమ మద్దత్తు నిచ్చి గెలిపించారు. కానీ ఒక రోజు మాత్రం చంచల్రావు మద్దతుదారుల సలహాలేకుండా పార్టీ నుంచి దూకేసి మరో పార్టీలో చేరిపోయాడు. అప్పుడే వచ్చిపడింది చిక్కు. చంద్రప్పకి చంచల్రావు పార్టీ మార్పు నచ్చలేదు. భోజరాజు మాత్రం చంచల్రావు కొమ్మే కాసేడు. దాంతో బావమరుదులు బద్ధ విరోధులైనారు. చంద్రప్ప మాత్రం ఒంటరివాడెలా అవుతాడు? చంచల్రావు ప్రత్యర్థి అయిన సత్యవంతుని పార్టీలో చేరిపోయాడు. అయితే బావమరుదు లిద్దరూ ప్రజాసేవ చేస్తూ రెండు పక్కా బిల్డింగులు కట్టించుకున్నారు. చెరొక తొమ్మిదేసెకరాల భూమిని సంపాదించుకున్నారు. పైగా ప్రజాసేవకులన్న పేరు ఉండనే వుంది. ఇంతలో భోజరాజు నిద్రలేచి బయటకొచ్చాడు.

"ఏం బావా! చాలాకాలానికి మళ్ళీ...."

"అదే బావా నీతో చిన్న పనివడింది."

"ఏంటో?"

"ఏముంది? నీకు తెలియనిదికాదు. ఒకప్పుడు మనిద్దరం ఒకటే పార్టీలో ఉండి ప్రజాసేవ చేశాం. చంచల్రావు పార్టీ ఫిరాయింపు మనల్ని దూరం చేసింది. మళ్ళీ అదేపార్టీ ఫిరాయింపు అంటే చెంచల్రావూ, సత్యవంతుడు కలసిపోవడంతో మనం మాత్రం తాడూ బొంగరంలేని స్థితి కొచ్చాం. అందుకని